## క్వారీ స్థలాన్ని పరిశీలించిన మైనింగ్ ఆర్ఐ

దేవరుప్పుల, మే 8 : ధర్మాపురం పరిధిలో వానకొండయ్య గుట్ట అంచున క్వారీ స్థలాన్ని గురువారం మైనింగ్ ఆర్ఐ అనిత పరిశీలించారు. క్వారీ సమీప లకావత్‌తండా వాసులు సోమవారం మంజూర్లైన క్వారీలో పనులు జరగకుండా చూడాలని ప్రజావాణిలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం సమర్పించారు. క్వారీ నడుపడం వల్లకలిగే నష్టాలను కలెక్టర్‌కు వివరించారు. విషయాన్ని కలెక్టర్ మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం మైనింగ్ ఆర్ఐ అనిత గుట్టపై క్వారీ స్థలాన్ని పరిశీలించారు. తండాకు చెందిన మహిళలు తమకు జరిగే నష్టాన్ని ఆమెకు వివరించారు. ఈ ప్రాంత ఇలవేల్పు అయిన వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి ముప్పు వస్తుందని వారు తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని అనిత తెలిపారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ, మే 8 (నమస్తే తెలంగాణ)/ పాలకుర్తి, మే8 : తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) నుంచి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, పాలకుర్తి తహసీల్దార్ నాగేశ్వరరావు గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులు తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాల్లో లైసెన్స్ సర్వే శిక్షణకు దరఖాస్తు చేయవచ్చని, ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో మొత్తం 50 పని దినాలు శిక్షణ ఇస్తారని వివరించారు. ఇంటర్ గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండి కనీసం 60శాతం మార్కులతో ఐటీఐ (డ్రాఫ్ట్ మెన్ (సివిల్)) డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) సమానమైన అర్హత ఉండాలన్నారు. దరఖాస్తు ప్రారంభ తేదీ మే 17వరకు మీ సేవ కేంద్రాల ద్వారా మాత్రమే రూ. 100 చెల్లించి పొందాలని సూచించారు. ఓసీ అభ్యర్థులకు రూ.10వేలు, బీసీలకు రూ.5వేలు, ఎస్సీఎస్టీలకు రూ.2,500 ఫీజు ఉంటుందని తెలిపారు.

## 13న జనగామలో జాబ్ మేళా..

జనగామ, మే 8 (నమస్తే తెలంగాణ) : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 13న మంగళవారం జాబ్ మేళా (ప్రైవేట్ జాబ్స్) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి పీ సాహితీ తెలిపారు. అర్హత, ఆసక్తి గల జనగామ జిల్లా, ఉమ్మడి వరంగల్ నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడాటాతోపాటు, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో 13న ఉదయం 10.30గంటలకు జనగామ కలెక్టరేట్‌లో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

నర్మెట, మే 8 : లింగ నిర్ధారణ , అబార్షన్ చేయించుకోవడం చట్టరీత్యా నేరమని నర్మెట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఉదయ్ కిరణ్ అన్నారు. మండలకేంద్రంలో హెచ్‌సీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్మెట, తరిగొప్పుల మండలాల్లో కొందరు గర్భిణులు సమీప స్కానింగ్ కేంద్రాల ద్వారా లింగ నిర్ధారణ చేయించుకొని, అబార్షన్ చేయించుకున్నట్లు మా దృష్టికి వచ్చిందని తెలిపారు. లింగ నిర్ధారణ, అబార్షన్ పరీక్షలు చేయించుకున్నా, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆలాంటి పరీక్షలు చేసినా మూడేళ్లపాటు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తారని అన్నారు. ఆయన వెంట వైద్య బృందం ఉన్నారు.



జనగామలో కోర్టు కేసుకు హాజరైన పొన్నాల లక్ష్మయ్య

## కోర్టు కేసుకు హాజరైన మాజీ మంత్రి పొన్నాల

జనగామ, మే 8 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా సాధన ఉద్యమంలో భాగంగా అప్పట్లో నమోదైన కేసులో గురువారం మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య జిల్లా కోర్టుకు హాజరయ్యారు. అనంతరం పట్టణంలోని గిర్నిగడ్డ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు దుర్గమ్మ గుడిని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల సతీశ్, జంగిటి అంజయ్య, గురువయ్య గౌడ్, ఎండీ మాజీద్, సౌడ మహేశ్, యాట క్రాంతికుమార్, రఘు ఠాగూర్, ఎండీ ఆజమ్, మడురి రాజు ఉన్నారు.

## టైలర్లందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

బచ్చన్నపేట, మే 8 : రాష్ట్ర వ్యాప్తంగా టైలర్ వృత్తిపైనే ఆధారపడి కుటుంబాలు వెల్లదీస్తున్న వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని టైలర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి తిరుపతి కోరారు. గురువారం ఆయన కేశిరెడ్డిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల మంది టైలర్లు దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారందరికి సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇండ్లు కేటాయించాలన్నారు. అదే విధంగా 50ఏండ్లు నిండిన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలన్నారు. రాజీవ్ యువవికాస పథకం కింద ప్రతి టైలర్‌కు రూ.లక్ష ఉచితంగా అందించాలని కోరారు. ఆయన వెంట పలువురు టైలర్లు ఉన్నారు.

## రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడిగా రవికుమార్

కొడకండ్ల, మే 8 : రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి ఆదేశానుసారం మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రాపోలు రవికుమార్ రాష్ట్రంలోని రజకులకు చేసిన కృషికిగాను రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం రాపోలు రవికుమార్ మాట్లాడుతూ ఈ నియామకానికి సహకరించిన ముప్పు భిక్షపతి, చేర్యాల ప్రకాశ్, సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు, పెద్దలకు, ధన్యవాదాలు తెలిపారు. రజకుల సంక్షేమానికి మరింత కృషి చేస్తానని రవికుమార్ తెలిపారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ, మే 8 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులు చదువుతోపాటు వివిధ కళల్లో రాణించేందుకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. యంగ్ ఇండియా వేసవి శిబిరాలను గురువారం పట్టణంలోని గణేశ్‌వాడ యూపీఎస్, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలు, సృజనాత్మకత నైపుణ్యాలను గుర్తించి వాటికి పదును పెట్టడమే లక్ష్యంగా తొలిసారిగా రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో 'యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాల'ను నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో 72ఉన్నత, 9ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 15కేజీవీబీల్లో కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు.

**వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ..**

6నుంచి 17ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలకు ఈనెల 25 వరకు 15 రోజులపాటు ప్రతి రోజు ఉదయం 8నుంచి 11గంటల వరకు శిక్షణ అందించనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లల ఆసక్తికి అనుగుణంగా కుట్లు, అల్లికలు, ఇండోర్ గేమ్స్, బొమ్మల తయారీ, చిత్ర లేఖనం, డ్యాన్స్, సంగీతం, డ్రమ్స్ వాయించడం, పాటలు పాడడం, ఏకపాత్రాభినయం, మిమిక్రీ, స్కిట్స్, మైమ్, యాంకరింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, వేదిక్ గణితం, మౌలిక కంప్యూటర్ పరిజ్ఞానం, కథలు చెప్పడం, రాయడం, చేతిరాత అభివృద్ధి పరుచుకోవడం, వ్యక్తిత్వ వికాసం, సైన్స్ ఎగ్జిబిట్స్ తయారు చేయడం, సామాజిక సేవ, తెలంగాణ సాంప్రదాయ కళలపై శిక్షణ ఇస్తారని కలెక్టర్ తెలిపారు. చివరి రోజు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులకు స్నాక్స్ ఇస్తారని, గ్రామాల్లో స్థానికంగా ఉన్న వనరుల దృష్ట్యా ఆయా అంశాలను ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న పాల్గొన్నారు.

**సమ్మర్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి**

లింగాలఘనపురం/నర్మెట/బచ్చన్నపేట/రఘునాథపల్లి/జఫర్‌గఢ్/దేవరుప్పుల/స్టేషన్ ఘన్‌పూర్, మే 8 : వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో భోజన్న, నర్మెట, బచ్చన్నపేట, దేవరుప్పుల ఎంఈవోలు మడిపల్లి ఐలయ్య, వెంకట్‌రెడ్డి, కళావతి అన్నారు. లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల ఉన్న పాఠశాలలో యంగ్ ఇండియా ఆధ్వర్యంలో, నర్మెట మండలంలోని వెల్దండ, హన్మంతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బచ్చన్నపేట మండలంలోని పడమటికేశ్వాపూర్, ఇటికాలపల్లి, బచ్చన్నపేట, కేశిరెడ్డిపల్లి, కొడవటూరు, కట్కూర్, రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్‌లో జఫర్‌గఢ్ మండలంలోని కూనూరు, దేవరుప్పుల మండలంలోని చినమడూరు, పెదమడూరు, సింగరాజుపల్లి, కోలుకొండ, కామారెడ్డిగూడెం, దేవరుప్పులలో, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నెల్లుట్లలో హెచ్‌ఎం శ్రీలత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, ఉపాధ్యాయులు జ్యోతి, సుకుమారి, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్, గోర్‌సింగ్, షకీల్, ఉమా, హన్మంతాపూర్, వెల్దండలో హెచ్‌ఎంలు దూడల రమేశ్, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్యాముల్ ఆనంద్, విజయ, మాధవి, శివరాం, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్‌లో హెచ్‌ఎం రవీందర్, మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, పీఎస్ హెచ్‌ఎం యాదవరెడ్డి, ఉపాధ్యాయులు జయకృష్ణ, శ్రీనివాస్, పంచాక్షరీ, శ్రీహరి, సంపత్, ఆంజనేయులు, ఉదయ్, నర్సింగరావు, అశోక్, కూనూరులో హెచ్‌ఎం ఎండీ ఫర్వేజ్, ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి కాటం రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఆకుల కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీ జీ వేణు, హెచ్‌ఎం కుసుమ రమేశ్, యంజాల ప్రభాకర్, విటి శ్రీనివాస్, పీఈటీ కొండా రవి, ఫకీర్‌దాస్, సర్వర్‌పాషా, లక్ష్మీప్రసాద్, శ్రీనాథ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎనిమిది గ్రామాల్లో 514 దరఖాస్తులు : ఆర్డీవో



సముద్రాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో

స్టేషన్ ఘన్‌పూర్, మే 8 : భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా ఈ నెల 5నుంచి ఇప్పటి వరకు 514 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో డీఎస్ వెంకన్న తెలిపారు. భూభారతి చట్టం అమలు నేపథ్యంలో జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. కాగా గత నాలుగు రోజులుగా మండలంలోని ఎనిమిది గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం సముద్రాల, పాంనూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో డీఎస్ వెంకన్న 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎనిమిది గ్రామాల్లో సర్వే నిర్వహించగా 514దరఖాస్తులు వచ్చాయన్నారు. 263 మందికి నోటీసులు ఇచ్చామని, 229సాదాబైనామా, 125 మిస్సింగ్ సర్వే నంబర్లు, 17 పెండింగ్ మ్యూటేషన్, 43 విస్తీర్ణంలో తేడాలు, 47 వారసత్వానికి సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మోహన్‌నాయక్, డీటీ సంధ్యారాణి, అనిల్‌బాబు, ఆర్ఐలు సతీశ్, శ్రీకాంత్, సత్యనారాయణ, దేవేందర్, పంచాయతీ కార్యదర్శి నరేశ్, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుమారస్వామి, విమలానర్సయ్య, మాజీ ఎంపీటీసీలు రజిత, సుగుణావెంకటేశ్ పాల్గొన్నారు.

# 27న ఆటో ఆకలి కేకలు మహాసభ



ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంద రవికుమార్

స్టేషన్ ఘన్‌పూర్, మే 8 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిన మహాలక్ష్మి పథకంతో జీవనోపాధి కరువై ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని ఈ నెల 27న నిర్వహించే ఆటో ఆకలి కేకలు మహాసభను విజయవంతం చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆటో కార్మికులను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులను చైతన్య పరుస్తూ చేపట్టిన ఆటో రథయాత్ర గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌కు చేరింది. ఈ సందర్భంగా మండల ఆటో డ్రైవర్ అధ్యక్షుడు గుర్రం మధుమోహన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంద రవికుమార్, మధుమోహన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకానికి ప్రత్యామ్నాయంగా ఆటో కార్మికులకు ఇస్తామన్న నెలకు రూ.12 వేలు ఇవ్వాలన్నారు. ప్రత్యేక ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇన్సూరెన్సను రూ.8వేల నుంచి వేయి రూపాయలకు తగ్గించాలన్నారు. హామీలు వెంటనే అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 27న ఇందిరా పార్క్‌లోని ఆటో అమరవీరుల ప్రాంగణంలో నిర్వహించనున్న ఆటో ఆకలి కేకలు మహాసభలో ప్రతి ఆటో డ్రైవర్ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పారునంది భిక్షపతి, బొట్టు అశోక్, గాదె శంకర్, టీ రమేశ్, రడపాక కుమార్, రడపాక జయపాల్ పాల్గొన్నారు.

# 9నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు

హనుమకొండ చౌరస్తా, మే 8 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 సెంటర్లలో ఈ నెల 9 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఉచిత క్రికెట్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి క్రికెట్ సెంటర్‌లో ఉదయం, సాయంత్రం జరిగే కోచింగ్‌లో పాల్గొనాలనుకునే క్రికెట్ క్రీడాకారులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరంగల్ (తోట రాము 9966559414)-కాకతీయ మెడికల్ కాలేజీ గ్రౌండ్ వరంగల్, మహబూబాబాద్(అజయ సారథి 98664 79666) కాంక్రీట్ క్రీడా మైదానం మహబూబాబాద్, భూపాలపల్లి (సిరిమల్లె శ్రీనివాస్ 8897 805683) సింగరేణి స్టేడియం భూపాలపల్లి, పరకాల (అభినవ వినయ్ 9666206662) ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ పరకాల, ములుగు (సందీప్‌నేత్ర 9030130727) తంగేడు క్రీడా మైదానం ములుగు, జనగామ (దిలీప్ రెడ్డి 99590 00003) జిల్లాలోని యశ్వంతపూర్‌లోని సెజ్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ -14,16,19,23 విభాగాల్లో స్థానిక కోచింగ్ సెంటర్‌లో తమ పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

స్టేషన్ ఘన్‌పూర్, మే 8 : మండలంలోని తాటికొండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మారపాక వెంకటయ్య కుటుంబాన్ని మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నగరబోయిన యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, ఎల్లస్వామి, ఎం ప్రభాకర్, రాజు, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

లింగాలఘనపురం, మే 8 : అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని పటేల్‌గూడెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్‌నేత కడ్డూరి సోమిరెడ్డి, నాయకులు పెండ్లి రాంరెడ్డి, పొన్నాల నరేశ్, ప్రవీణ్, లక్ష్మణ్, గోపాల్, శ్రీనివాస్ గురువారం జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషాకు వినతిపత్రం అందించారు. పటేల్‌గూడెంలో అనర్హులకు ఇండ్లు మంజూరయ్యాయని, అర్హులకు మొండి చేయి చూపారని, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు పూర్తి విచారణ చేసి అర్హులకు ఇండ్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

**సీపీ సన్‌ప్రీత్ సింగ్**

సుబేదారి, మే 8 : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. మద్యం షాపుల ముందు మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి ఆయా ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతారని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

**ఒక్కరోజే 221మందిపై కేసు..**

బుధవారం ఒక్క రోజే కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీసు యాక్ట్ కింద బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 221మందిపై కేసు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. జనగామ డివిజన్‌లో 57, హనుమకొండ 42, స్టేషన్‌ఘన్‌పూర్ 40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్‌లో 10 చొప్పున కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం షాప్‌ల ముందు, పరిసరాల్లో ఎవరైనా మద్యం తాగితే షాప్ యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైన బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వెంటనే 100కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు.

## జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కైలాస్‌యాదవ్

హనుమకొండ చౌరస్తా, మే 8 : తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖిలావరంగల్ మధ్యకోటకు చెందిన బైరబోయిన కైలాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఫిబ్రవరిలో హైదరాబాద్ నాంపల్లిలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా, అంతర్జాతీయ క్రీడాపోటీలు కొనసాగుతున్న నేపథ్యంలో ఫలితాలను నిలిపివేశారు. గురువారం తెలంగాణతో పాటు మరో 15 రాష్ట్రాల నూతన కమిటీ జాబితాను జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటర్, అలహాబాద్ రిటైర్డ్ జడ్జి పంకజ్ సక్సేనా ప్రకటించారు. తెలంగాణ జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు పదవులను దక్కించుకున్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా డీ సంతోష్, బీ సాయిరాంయాదవ్, టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా సీహెచ్ రాము, టెక్నికల్ కమిటీ సెక్రటరీగా నాగరాజు ఎన్నికయ్యారు. వీరందరూ నాలుగేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జూడో సంఘం నూతన కమిటీలను వేయడంతో పాటు జూడో క్రీడాభ్యున్నతి, క్రీడాకారుల సంక్షేమం కోసం పాటుపడతానని కైలాస్‌యాదవ్ అన్నారు.

## మూడు రోజులుగా రోడ్డుపైనే చెట్టు

తరిగొప్పుల, మే 8 : రోడ్డుపైన చెట్టు పడి మూడు రోజులు అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో తరిగొప్పుల నుంచి సోలీపూర్‌కు వెళ్లే ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు నడిచే ఈ రోడ్డు పైన పెద్ద చెట్టు కొమ్మ విరిగి పడింది. అయినా దాన్ని పక్కకు తీసేద్దామన్న ధ్యాస సంబంధిత అధికారులకు లేకపోవడం విచారకరమని ప్రజలు వాపోతున్నారు. అటుగా వెళ్లే వారు కాస్త ఆద మరిస్తే ప్రమాదాల బారిన పడాల్సిందేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పైన పడిన చెట్టును వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

## వాసవీ మాతకు పంచామృతాలతో పూజలు

జఫర్‌గఢ్, మే 8 : జఫర్‌గఢ్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వాసవీ మాతకు పంచామృతాలతో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి లోక కల్యాణార్థం పంచామృతాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పౌరోహితులు అనిల్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

రఘునాథపల్లి, మే 8 : మండలంలోని నిడిగొండ, రఘునాథపల్లి రైల్వేలైన్ మధ్యలో ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. జనగామలోని దయా నిలయం సమీపంలోని పెట్రోలు బంక్‌లో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన అజయ్ గురువారం ఉదయం రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్వర్ట్ పైనుంచి పడి ఒకరు మృతి

స్టేషన్ ఘన్‌పూర్, మే 8 : మండలంలోని ఇప్పగూడం గ్రామానికి చెందిన తోట సుందరయ్య (40) తండ్రి నర్సయ్య గురువారం ఉదయం గ్రామంలోని రోడ్ పక్కన గల కల్వర్ట్ పైనుంచి ప్రమాదవశాత్తు పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ జీ వేణు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పట్టణంలోని 3వ వార్డులో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## జూన్‌లోగా పనులు పూర్తి చేయాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- డ్రైనేజీ పనుల పరిశీలన

జనగామ, మే 8 (నమస్తే తెలంగాణ) : జూన్ చివరివారంలోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 3వ వార్డు మాజీ కౌన్సిలర్ సుధాసుగుణాకర్ రాజుతో కలిసి ఆయన డ్రైనేజీ పనులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని ధర్మశాల శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీనగేశ్వరి, శ్రీసీతారామ చంద్రస్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దయాకర్, బీఆర్ఎస్ నాయకులు బక్క నాగరాజు, గద్దల నర్సింగరావు, తాడెం శ్రీనివాస్, డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఉడుగుల కిష్టయ్య, జూకంటి శ్రీశైలం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బిజ్జాల నవీన్, ఎమ్మెల్యే పీఏ తమ్మిశెట్టి మల్లికార్జున్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పలు వేడుకలకు హాజరైన ఎర్రబెల్లి



పల్లా సుందరరాంరెడ్డిని సన్మానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, మే 8 : మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు చెందిన పలు వేడుకలకు గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరయ్యారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి జన్మదిన వేడుకలకు హాజరై ఆయనను ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం నీర్మాలకు చెందిన ఎడ్ల రంగయ్య-హరిత కుమారుని వివాహానికి, రామరాజుపల్లి బీఆర్ఎస్ నాయకుడు బోయిన బాలరాజు-కూతురు వివాహం, మాధాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జట్టి ఎల్లయ్య కూతురు వివాహానికి హాజరై ఆయా జంటలను ఆశీర్వదించి కానుకలు అందజేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, ఆలకుంట్ల యాదగిరి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కుతాటి నర్సింహులు, పాలకుర్తి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు, పీ కృష్ణ ఉన్నారు.

**పండుగలు సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక..**

పాలకుర్తి, మే 8 : తెలంగాణలో పండుగలు సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మంచుప్పులలో గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన గంగాదేవి పండుగకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బత్తిని దేవయ్య కుమార్తె శ్రీహర్షిణి-మధుకర్‌గౌడ్ వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మంచుప్పులలో గంగాదేవి పండుగకు పాలకుర్తి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, తాజా మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మాచర్ల ఎల్లయ్య, బోలగాల శ్రీనివాస్, గుణిగంటి వాసురావు, గర్వందుల మల్లేశ్, జోగు గోపీ, బత్తిని గోపాల్, పరశురాములు, రమేశ్‌రావు, మాటూరి యాకయ్య పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**

జనగామ, మే 8 (నమస్తే తెలంగాణ) : యువత మాదక ద్రవ్యాల మాయలో పడకుండా బంగారు భవిష్యత్‌కి బాటలు వేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నషా ముక్తి అభియాన్ ద్వారా మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలనపై గ్రామస్థాయిలో పనిచేసే ఆశ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, అటెండర్స్, మహిళా ఉద్యోగినులకు జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏర్పడేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం కంచి వెల్ఫేర్ సొసైటీ హైదరాబాద్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అటెండర్లు, ఆశ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీఆర్‌డీవో వసంత, డీపీవో స్వరూప, కంచి వెల్ఫేర్ సొసైటీ పరమేశ్వరిశర్మ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.



చీరెలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

**ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రావద్దు..**

ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రావద్దని, ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా సజావుగా జరగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలాల వారీగా వివిధ శాఖల అధికారులు తాగునీటి సరఫరాపై తీసుకునే యాక్షన్ ప్లాన్‌పై గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సేవలతోపాటు డెలివరీలు నెలకు 50కు తగ్గకుండా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 15కు తగ్గకుండా చేయాలని సూచించారు. జిల్లాలో మాతృ మరణాలను సున్నాకు తీసుకురావాలన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షలను జూన్ 15నాటికి పూర్తి చేయాలని ఆర్‌బీఎస్‌కే టీంలకు సూచించారు. సమావేశములో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కే మల్లికార్జున్‌రావు, జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ డా.వీరంజనేయులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డీ రవీందర్‌గౌడ్, స్వర్ణకుమారి, సుధీర్, అశోక్‌కుమార్, కమల్‌హాసన్, సామాజిక ఆరోగ్య కేంద్రాల సూపరింటెండెంట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

**అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి..**

జనగామ రూరల్ : అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. గురువారం జనగామ మండలంలోని గోపరాజుపల్లి, పెద్దపహాడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీబాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, సీఈవో రామ్మోహన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**
★నేను, బసికె విజయ్‌కుమార్ S/o బసికె రత్నం నా యొక్క పాస్‌పోర్ట్ 2025 ఏప్రిల్ 20న లేబర్ కాలనీ నుండి ఖిలా వరంగల్‌కు వెళుతుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. నాపాస్‌పోర్ట్ నెం. J5092952 గల పాస్‌పోర్టు ఎవరికి అయిన దొరికితే నా ఫోన్ నెం. 9849776722 లలో సంప్రదించగలరని ప్రార్థన. NTW-000

**CHANGE OF NAME**
I, MOHAMMED KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER R/o H.No. 11-23-2007, LB Nagar, Near ZIA Masjid, Warangal, district,-506002, T.G. My name is Changed from MOHAMMED ABDUL KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER to MOHAMMED KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER for all purposes.

**గోదాం కావలెను**
★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500-2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590. NTW-000

**CHANGE OF NAME**
★I, MOHAMMED MUJEEBUDDIN S/o MOHAMMED ANWARUDDIN R/o H.No.11-22-830/1, Madeena Street, L.B.Nagar, Warangal City & Dist., have changed my name from MOHAMMED ABDUL MUJEEB to MOHAMMED MUJEEBUDDIN S/o MOHAMMED ANWARUDDIN for all future Purposes. NTW-17627

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**CHANGE OF NAME**
★I, MAMIDALA ANNAPURNA (New Name) previously called MAMIDALA ANNAPOOORNA (Old Name), W/o MAMIDALA PRAKASH, R/o. H.No: 1-9-965, Postal colony, Near Adalath, Hanamkonda District,-5060002, T.G solemnly declare. NTW-17628

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565